క్లుప్తంగా

ముగిసిన వారాహి నవరాత్రి మహోత్సవాలు



పాత గుంటూరు: శ్రీనగర్‌లోని శ్రీ లలితా పరమేశ్వరి దేవస్థానంలో శ్రీ రాజ శ్యామల పీఠం ఆధ్వర్యంలో వారాహి నవరాత్రి మహోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. వారాహి అమ్మవారికి విశేష ద్రవ్యాలతో కన్నుల పండువగా అభిషేకం చేశారు. పుష్పార్చనలు, సహస్రనామార్చనలు, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. పీఠ వ్యవస్థాపకులు వెలమకన్ని నాగార్జున శర్మ, సందీప్ శర్మ, వల్లూరు హనుమత్ సాయి పాల్గొన్నారు.

మూడు దేవస్థానాల హుండీ లెక్కింపు



పాత గుంటూరు: దేవదాయ శాఖ పరిధిలోని కొత్తపేట శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం, శ్రీ జగన్నాథస్వామి దేవస్థానం, లాలాపేట శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీల లెక్కింపును బుధవారం నిర్వహించారు. జగన్నాథస్వామి దేవస్థానానికి రూ. 5,045, ఆంజనేయస్వామి దేవస్థానానికి రూ.4,79,989, వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి రూ. 4,02,098 ఆదాయం వచ్చింది. మూడు దేవస్థానాలకు మూడు నెలలకు గానూ రూ.8,87,132 ఆదాయం వచ్చిందని అసిస్టెంట్ కమిషనర్, ఏవో డి. శ్రీనివాసరావు తెలిపారు. లెక్కింపులో పర్యవేక్షణాధికారి కె. వీరాంజనేయులు, చైర్మన్ జయప్రకాష్‌రెడ్డి, సభ్యులు విశాలక్షి జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, శ్రీనివాసులు, వెంకటరత్నం, అనిత, శివకుమారి, సిబ్బంది, సద్గురు సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పాలనపై ఇంటింటి ప్రచారం



గుంటూరు మెడికల్: పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ తోట రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం కృష్ణబాబు కాలనీలో ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనపై నేతలు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొమ్మిది సంవత్సరాల పాలనలో ప్రజల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. నరేంద్ర మోదీకి మద్దతుగా 9090902024 నంబర్‌కు మిస్డ్ కాల్ చేయాలని ప్రజల్ని కోరారు. కార్యక్రమంలో అప్పిశెట్టి రంగారావు, ఈదర శ్రీనివాసరెడ్డి, రాంబాబు, అనుమోలు ఏడుకొండలు, పోతురాజు వెంకట్, మోతె శేషగిరి, కామేపల్లి వెంకటేశ్వర్లు, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

భారత ఆర్థిక వ్యవస్థను స్థిరమైన గమ్యానికి చేర్చిన పీవీ



తెనాలి: భారతదేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్న కాలంలో ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తెలుగునేత పీవీ నరసింహారావు స్థిరమైన గమ్యానికి చేర్చిన మహనీయుడని బ్రాహ్మణ పరిషత్ నాయకులు స్మరించుకున్నారు. భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 102వ జయంతిని స్థానిక బోసురోడ్డులోని ఆయన విగ్రహం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, రాష్ట్ర ఆపన్న ప్రదీపనా బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య గౌరవ సలహాదారు యనమద్రసాయి సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 1921లో సాధారణ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన పీవీ నరసింహారావు బహుభాషాకోవిదుడని గుర్తుచేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా సమర్థంగా పనిచేసి, భారతదేశానికి తొలి తెలుగు ప్రధానిగా దేశ పరిపాలనలో తనదైన ముద్ర వేశారని చెప్పారు. ఆర్థిక సరళీకరణ విధానాలను ప్రవేశపెట్టారని చెప్పారు. ఇంతటి మహనీయుడైన పీవీకి భారతరత్న ఇవ్వాలని సురేష్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఇదే వేదిక నుంచి సురేష్ దంపతులు త్రిపురాంతకంలో శతచండీ యాగం నిర్వహిస్తున్న పట్టణానికి చెందిన విష్ణుబట్లవారికి రూ.2 లక్షల విలువైన ఆవు నెయ్యి, బియ్యం, దీక్షా వస్త్రాలను బ్రాహ్మణ పరిషత్ ద్వారా అందజేశారు. పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు పరాశరం వెంకట రామగోపాల్, పోతావఝుల పురుషోత్తమశర్మ, పెద్దిరాజు సత్యం, వంగల మాధవరావు, చెన్నాప్రగడ శ్రీనివాసరావు, దావులూరి శ్యాంసుందరశర్మ, చిలకలపూడి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి హామీ నెరవేర్చాం

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- తక్కెళ్లపాడులో ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల ద్వారా పొందిన ప్రయోజనాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

తక్కెళ్లపాడు(పెదకాకాని): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలు (సంక్షేమ పథకాలు) అన్నీ నెరవేర్చిన ఘనత సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తెలిపారు. పెదకాకాని మండలం తక్కెళ్లపాడులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమైంది. స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రతి ఇంటికీ వెళ్లారు. గ్రామంలో మొత్తం 465 కుటుంబాలను కలిశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని వివరించారు. ఆయా కుటుంబాలు పొందిన ప్రయోజనాలకు సంబంధించిన బ్రోచర్‌ను అందజేశారు. ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్యకు గడప గడపలోనూ ఘన స్వాగతం లభించింది. ప్రజలు పూలమాలలు వేసి, హారతులిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీ కే దక్కుతుందని తెలిపారు. పెదకాకాని మండలంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేశామని, త్వరలో నిర్మాణాల్ని కూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం ఒక్కసెంటు భూమి కూడా పంపిణీ చేయలేదని విమర్శించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ, వలంటీర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అమ్మ ఒడి, రైతుభరోసా, జగనన్న చేయూత, జగనన్న తోడు, ఆసరా, సున్నావంటి వంటి సంక్షేమ పథకాల్ని పార్టీలకు అతీతంగా అందరికీ అందించినట్లు తెలిపారు. ప్రజా సమస్యల్ని ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ప్రభుత్వం గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగన్ పరిపాలన సాగుతోందని తెలిపారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాల ద్వారా కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కాలువలు ఏర్పాటు, రోడ్డు, కరెంటు స్తంభాల సమస్యల్ని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంపీడీవో బి.వి. మల్లేశ్వరరావు, ఈవోపీఆర్డీ రామాంజనేయులు, స్థానిక నాయకులు మేరిగ సుబ్బారావు, ,పెనుమాల అరుణ్‌గాంధీ, షేక్ కాశీం, పెరవలి కిశోర్, బండి మరియమ్మ, కాకాని మల్లేశ్వరరావు, కగ్గా శివయ్య, సునంద, పలువురు అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

1నుంచి 'జగనన్న సురక్ష' శిబిరాల నిర్వహణ

చేబ్రోలు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జగనన్న సురక్ష' చేబ్రోలు మండల షెడ్యూల్‌ను ఎంపీడీవో బి. బాబూరావు బుధవారం తెలిపారు. జులై 1నుంచి 31 వరకు మండలంలోని 17 గ్రామ సచివాలయాల పరిధిలో రెండు ప్రత్యేక బృందాల ద్వారా సమావేశాలు నిర్వహించి, సమస్యల్ని పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. టీం-1లో తహసీల్దారు కె.వి.గోపాలకృష్ణ, ఈవోపీఆర్డీ జి.శ్రీనివాసరావు, వివిధ శాఖలకు చెందిన మరో ఎనిమిది మంది ఉంటారు. టీం-2లో ఎంపీడీవో బి. బాబూరావు, డీటీ వి. ప్రణతితో పాటు వివిధ శాఖలకు చెందిన మరో 11మందితో బృందాలు సమావేశాలకు హాజరవుతారు. ఆయా తేదీల్లో సచివాలయాల వద్ద రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్, సర్వీస్ హెల్ప్ డెస్కులతో పాటు జగనన్నకు చెబుదాం ఆర్జీలు స్వీకరణ, నమోదు చేస్తారు.

షెడ్యూల్ వివరాలు ఇలా...

- జులై 1న టీం-2 బృందం (వేజండ్ల-1 సచివాలయం),
- జులై 4న టీం-1 బృందం (చేబ్రోలు-2 సచివాలయం), టీం-2 బృందం (చేబ్రోలు-1 గ్రామ సచివాలయం)
- జులై 6న టీం-1 బృందం (చేబ్రోలు-4 సచివాలయం), టీం- 2 బృందం (చేబ్రోలు-3 సచివాలయం)
- జులై 11న టీం-1 బృందం (శ్రీరంగపురం సచివాలయం), టీం-2 బృందం (చేబ్రోలు-5 సచివాలయం)
- జులై 13న టీం-1 బృందం (నారాకోడూరు-1 సచివాలయం), టీం-2 బృందం (మంచాల సచివాలయం)
- జులై 15న టీం-1 బృందం (నారాకోడూరు-2 సచివాలయం), టీం-2 బృందం (గొడవర్రు సచివాలయం)
- జులై 18న టీం-1 బృందం (శలపాడు సచివాలయం), టీం-2 బృందం (శేకూరు సచివాలయం)
- జులై 20న టీం-1 బృందం (సుద్దపల్లి గ్రామ సచివాలయం), టీం-2 బృందం (వేజండ్ల-2 సచివాలయం)
- జులై 22న టీం-1 బృందం (వడ్లమూడి-2 సచివాలయం), టీం-2 బృందం (వడ్లమూడి-1 గ్రామ సచివాలయం)

రాజకీయ లబ్ధి కోసమే టీడీపీ దుష్ప్రచారాలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు తదితరులు

చేబ్రోలు: హత్యా రాజకీయాలు, చీకటి వ్యాపారాలకు మారుపేరుగా ఉన్న టీడీపీ నాయకులు రాజకీయ లబ్ధి కోసమే వైఎస్సార్ సీపీ నాయకులపై దుష్ప్రచారాలు చేస్తున్నారని పొన్నూరు వ్యవసాయ మార్కెట్టు కమిటీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు విమర్శించారు. పొన్నూరు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆకుల వెంకటేశ్వరావు మాట్లాడుతూ మార్కెటింగ్ ఉద్యోగి షేక్ హుస్సేన్ బాషు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటనను పచ్చమీడియా ద్వారా టీడీపీ నాయకులు హత్యగా చిత్రీకరించి రాద్ధాంతం చేస్తున్నారని దుయ్యబట్టారు. సూపర్‌వైజర్ అవినాష్ ఇచ్చిన రిపోర్టును బహిర్గతం చేసి చూపించారు. ఎఫ్‌ఐఆర్‌లో ఏముందో టీడీపీ నాయకులు తెలుసుకోవాలని సూచించారు. స్టేట్ ఇరిగేషన్ శాఖ కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్ దాసరి నారాయణరావు, మల్లెల రాజు, ఎందేటి వెంకటసుబ్బయ్య, పెరికల కృష్ణమోహన్, అధిశేషు, దేవరకొండ గోపీ, షేక్ సుభాని పాల్గొన్నారు.

కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి

జగనన్న లేఅవుట్‌లో అధికారుల బృందం పర్యటన



హౌసింగ్ లే అవుట్‌లో పర్యటిస్తున్న అధికారుల బృందం

ప్రత్తిపాడు: కాలనీలో మౌలిక వసతుల కల్పనతో పాటు సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీవో శ్రీరమ్య, తహసీల్దార్ సిద్ధార్థ నివాసితులకు భరోసానిచ్చారు. ప్రత్తిపాడులోని జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న కొందరు మహిళలు మంగళవారం తహసీల్దార్, ఎంపీడీవోలను కలసి సమస్యల్ని ఏకరువు పెట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఎంపీడీవో, తహసీల్దార్లతో కూడిన అధికారుల బృందం కాలనీలో పర్యటించింది. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిశీలించింది. కాలనీలో మురుగు నీరు ముందుకు పారేందుకు తీసుకోవాల్సిన చర్యల్ని మ్యాప్ ఆధారంగా హౌసింగ్, పీఆర్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలసి చర్చించారు. అంతర్గత రోడ్ల నిర్మాణంతో పాటు సమృద్ధిగా తాగునీటి కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకోవచ్చన్న అంశాల్ని చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కాలనీవాసులు ఇబ్బంది పడకుండా ఒకదాని వెంట ఒకటి అభివృద్ధి పనుల్ని చేసుకుంటూ వస్తున్నట్లు చెప్పారు. మురుగు నిలబడకుండా పారేలా యుద్ధ ప్రాతిపదికన కచ్చా డ్రెయిన్లు తీయిస్తామని తెలిపారు. తహసీల్దార్ సిద్ధార్థ మాట్లాడుతూ ప్రాధాన్యతాంశంగా ప్రభుత్వం జగనన్న హౌసింగ్ లేఅవుట్స్‌లో మౌలిక వసతులు కల్పిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఏఈలు వినీల్, సురేష్, వైకేపి ఏపీఎం సురేష్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అవగాహన కల్పించండి

లబ్ధిదారులకు అర్థమయ్యేలా అవగాహన కల్పించి, ఇంటి నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలని ఎంపీడీవో ఏ. శ్రీరమ్య చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆమె గృహ నిర్మాణాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సచివాలయాల వారీగా పురోగతిని సమీక్షించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో లబ్ధిదారులు వేగంగా నిర్మాణాలు మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలని ఆమె తెలిపారు. నిర్మించుకోలేని వారికి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇస్తుందన్న విషయాన్ని వివరించాలని సూచించారు. సమావేశంలో ఏపీఎం సురేష్‌కుమార్, హౌసింగ్ ఏఈ సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలకు సత్వర పరిష్కారం

పాత గుంటూరు: ప్రయాణికుల సమస్యల్ని సత్వరం పరిష్కరించేందుకు సత్వర చర్యలు తీసుకుంటామని గుంటూరు- 2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలామ్ తెలిపారు. డిపోలో బుధవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎంలో ఆయన ప్రజలు నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

- గుంటూరు బస్టాండ్ నుంచి తెనాలికి నాన్ స్టాప్ సర్వీసులు ఏర్పాటు చేయాలని గుంటూరు నుంచి ఆవుల అప్పారావు కోరారు.
- గుంటూరు బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్‌కు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని గుంటూరు నుంచి నరేంద్రనాథ్ కోరారు.
- గుంటూరు నుంచి తెనాలి వయా నంబూరు మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని గుంటూరు నుంచి శ్రీకాంత్ కోరారు.

రారెత్తిస్తున్న టమాటో ధర



మార్కెట్లో రాశి పోస్తున్న టమాటోలు

తెనాలి: టమాటోలు కూరకు కలిసొస్తాయి. ఏ కూరలోనైనా చేర్చుకుంటే అదనపు రుచి వస్తుంది. అందుకే వీటి వినియోగం అధికం. ప్రస్తుతం టమాటో ధరలు మార్కెట్లో మండి పోతున్నాయి. పచ్చి మిర్చి ఘాటు నషాళానికెక్కుతోంది. కొన్ని తీగె జాతి కూరగాయల్లోనూ ఈ పెరుగుదల కనిపిస్తోంది. ఫలితంగా వినియోగదారులు కూరగాయలకు ధరాభారమైంది. స్థానిక మార్కెట్లో రూ.40-45లుగా ఉన్న టొమాటో ధర 24 గంటలు గడిచేసరికి రెట్టింపయింది. గత రెండురోజులుగా కిలో టమాటోలకు రూ.80 పెట్టాల్సి వస్తోంది. దీనికితోడు పచ్చి మిర్చి ధర టమాటోకు మించిపోయింది. రైతుబజారులోనే 98 రూపాయలు పలుకుతోంది. ఏ కూర వండుకున్నా పచ్చి మిర్చి లేకుండా కుదరదు కదా! రోహిణి కార్తె ఎండలతో బేజారెత్తిన ప్రజలకు, నైరుతి రుతుపవనాలు పన్నీటి జల్లును కురిపించాయి. గత మూడురోజులుగా జనం చల్లగాలి ఆనందాన్ని అనుభవించారు. ఆ వర్షాలే ఇప్పుడు కూరగాయల ధరల పెరుగుదలకు కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. టమాటో పంటను చిత్తూరు జిల్లా మదనపల్లి ప్రాంతం నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. పచ్చి మిర్చి మైదుకూరు నుంచి వస్తోంది. భారీ వర్షాలకు ఆయా ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయట! ఫలితంగా అక్కడ్నుంచి కొనుగోలు రేటే అధికంగా ఉండడంతో ధరలు ఇలా ఉన్నాయని చెబుతున్నారు. వ్యాపారుల సంగతలా ఉంచితే కూరగాయల ధరలు మరీ ఇంతగా పెరిగితే ఎలాగని వినియోగదారులు సణుక్కుంటున్నారు. డెల్టా ప్రాంతంలో కూరగాయల సాగు విస్తీర్ణం తక్కువని తెలిసిందే. అక్కడక్కడా మాగాణి భూముల్లో వేసిన తీగె జాతి కూరగాయల తోటలు కాపు అయిపోయి, ఖరీఫ్ వరి సాగుకని తీసేశారు. ఫలితంగా వాటి దిగుబడి తగ్గి, ఆ ప్రభావం ధరలపై పడింది.

రైతు భరోసా కేంద్రాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏవో అరుణకుమారి

ప్రత్తిపాడు: రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది కచ్చితంగా ప్రతిరోజూ రైతులకు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయాధికారి కె. అరుణ కుమారి ఆదేశించారు. ప్రత్తిపాడులోని రైతు భరోసా కేంద్రాల్లో ఆమె బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అటెండెన్స్ రిజిస్టర్‌తో పాటు పలు రికార్డుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొన్నటి వరకు ఆర్‌బీకేలో సిబ్బంది కొరత సమస్య ఉందన్నారు. అయితే, ప్రస్తుత వ్యవసాయ సీజన్‌కు దాన్ని అధిగమించామని చెప్పారు. మండలంలో మొత్తం పదమూడు ఆర్‌బీకేలకు గానూ పదకొండు కేంద్రాలకు వీఏఏలు, వీహెచ్ఏలు, ఎంపీఈవోలును ఉన్నతాధికారులు కేటాయించారని తెలిపారు. వీరంతా ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కేంద్రాల్లో రైతాంగానికి అందుబాటులో ఉండాలని చెప్పారు. వ్యవసాయ సీజన్ ఆరంభమైన నేపథ్యంలో ఆర్‌బీకేలకు విత్తనాలు, ఎరువులు వస్తున్నాయని, వాటిని రైతులకు సకాలంలో అందించాలని ఆమె సిబ్బందికి సూచించారు.

ఎఫ్ఏ-1 సిలబస్ త్వరితగతిన పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో రమాదేవి, పక్కన ఎంఈవో-2 లీలారాణి తదితరులు

నడింపాలెం (ప్రత్తిపాడు): ఎఫ్ఏ-1 సిలబస్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈవో సీహెచ్. రమాదేవి ఆదేశించారు. మండలంలోని చినకోండ్రుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో ఉపాధ్యాయులు తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన జాగ్రత్తల్ని వివరించారు. ప్రతి విద్యార్థికి నూటికి నూరు శాతం జగనన్న విద్యాకానుక కిట్లు అందించాలని ఆదేశించారు. జగనన్న గోరుముద్ద పథకం అమల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉన్నా సహించబోమని తెలిపారు. ఎంఈవో-2 లీలారాణి మాట్లాడుతూ ఉపాధ్యాయులు కచ్చితంగా డైరీ రాయాలని, పాఠ్య ప్రణాళికలు అప్ టు డేట్ ఉండాలని సూచించారు. విద్యార్థుల నోట్‌బుక్స్ కరెక్ట్ చేయడంతో పాటు వర్క్‌బుక్స్‌ను స్కూల్లోనే రాయించి, అక్కడే పరిశీలించాలని తెలిపారు. విద్యార్థులంతా యూనిఫాంలో పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో కాంప్లెక్స్ చైర్మన్ జె. విజయ్‌కుమార్, సీఆర్పీలు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు మంజూరు



ఆటో ప్రచార జాతాను ప్రారంభిస్తున్న తహసీల్దార్ సిద్ధార్థ

ప్రత్తిపాడు: పంట సాగుదారుల చట్టం కింద కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేస్తామని ప్రత్తిపాడు తహసీల్దార్ జి. సిద్ధార్థ తెలిపారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో పంట సాగుదారుల చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆటో ప్రచార జాతాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలు రైతు కార్డులు తీసుకోవడం ద్వారా రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీ విత్తనాలు, బ్యాంకుల ద్వారా రుణాలు పొందవచ్చని తెలిపారు. కౌలు రైతుకు 11 నెలలు మాత్రమే పంటపై హక్కు ఉండే విధంగా కార్డులు మంజూరు చేస్తామని, భూ యజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. కౌలు రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు. కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, ఏరియా కో-ఆర్డినేటర్ వి. భగవాన్‌దాస్, తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ మాణిక్యరావు, వీఆర్వోలు, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, కౌలు రైతులు, పాల్గొన్నారు.

మాజీ ప్రధాని పీవీకి భారతరత్న ప్రకటించాలి



పీవీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పాండురంగ విఠల్, కోనూరి సతీష్‌శర్మ తదితరులు

గుంటూరు రూరల్: మాజీ ప్రధాని పి.వి. నరసింహారావుకు భారతరత్న ప్రకటించాలని ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ సభ్యుడు వెలవర్తిపాటి పాండురంగ విఠల్, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరు సతీష్ శర్మ డిమాండ్ చేశారు. ఇన్నర్ రింగ్ రోడ్డులోని రాష్ట్ర బ్రాహ్మణ సమాఖ్య కార్యాలయంలో బుధవారం పీవీ 102వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాండురంగ విఠల్ మాట్లాడుతూ పి.వి. నరసింహారావు గొప్ప మేధావిగా పేర్కొన్నారు. మైనార్టీలో ఉన్న ప్రభుత్వాన్ని ఐదేళ్లు నిర్విఘ్నంగా పరిపాలించారన్నారు. దేశాన్ని ప్రపంచీకరణ దిశగా నడిపించిన ధీశాలి అని, గ్లోబలైజేషన్ సృష్టికర్తగా పేరు తెచ్చుకొన్నారని తెలిపారు. కోనూరు సతీష్ శర్మ మాట్లాడుతూ అపర మేధావి పీవీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాచిరాజు మురళీకృష్ణ, మాదిరాజు సాయి తరుణ్, ఒరుగంటి విశ్వనాథం పాల్గొన్నారు.

కలెక్టర్ చొరవ రాష్ట్రానికి ఆదర్శం



కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించేందుకు ప్రతి నెలా ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించిన జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి చొరవ రాష్ట్రానికే ఆదర్శమయ్యిందని ఏపీ ఎస్ఆర్ఏ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ కొనియాడారు. కలెక్టరేట్ చాంబర్‌లో బుధవారం ఆయన్ను ఘనంగా సత్కరించారు. కిరణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగుల సమస్యల పరిష్కారమైన తీరును గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం దీన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. దీర్ఘకాలికంగా ఉన్న ఉద్యోగుల సమస్యలు అతి సులభంగా పరిష్కారమైపోతున్నాయని చెప్పారు. ఉన్నతాధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు అద్భుతమైన సేవ చేయొచ్చని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘ నాయకులతో కలెక్టర్ పలు అంశాల్ని చర్చించారు.

భార్య, కుమారుడిపై కత్తితో దాడి



గాయపడిన సరిత

పెదకాకాని: భార్య, అడ్డు వచ్చిన కుమారునిపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేసిన సంఘటన ఉప్పలపాడులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వరగాని జయరావుకు 19 ఏళ్ల కిందట సరితతో వివాహమైంది. వారికి ఉదయ బాబు, జాన్ బాబు ఇద్దరు సంతానం. జయరావు మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆరు నెలల కిందట సరిత గుంటూరుకు చెందిన రఘుతో ఫోన్లో మాట్లాడుతుండగా గమనించిన జయరావు మందలించాడు. అప్పటినుండి తరచూ భార్య సరితపై గొడవ పడుతూ వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈనెల 27వ తేదీ రాత్రి పథకం ప్రకారం భార్య ఇంట్లో ఉండగా తలుపులు వేసిన జయరావు కూరగాయలు కోసే చాకుతో పొడిచి హత్యాయత్నం చేశాడు. స్వల్ప గాయాలతో బయటపడిన సరిత కేకలు వేయడంతో బయటున్న ఇద్దరు కుమారులు తలుపులు కొట్టి తీయించారు. కోపోద్రిక్తుడైన జయరావు అడ్డువచ్చిన చిన్న కుమారుడు కూడా కత్తితో పొడిచి పలుచోట్ల గాయపరిచాడు. పెద్దగా కేకలు వేయడంతో ఇరుగు పొరుగువారు అక్కడ చేరుకొని 108 వాహనంలో బాధితులను చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య సరిత ఫిర్యాదు మేరకు జయరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

నోడల్ అధికారిగా ఎస్‌బీ సీఐ నియమాకం

నగరంపాలెం: బక్రీద్ పండుగ సందర్భంగా యానిమల్ రెస్క్యూ జిల్లా నోడల్ అధికారిగా స్పెషల్ బ్రాంచి (ఎస్‌బీ) సీఐ నరసింహారావుని నియమించినట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు తెలియజేయాలంటే 86888 31391కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

వ్యక్తిపై దాడి : కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: కిరాణా షాపు ముందు ద్విచక్ర వాహనం పార్కింగ్ దగ్గర జరిగిన ఘర్షణపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రామన్నపేట అమూల్య టవర్స్ వద్ద బొంతల సుబ్రహ్మణ్యం కిరాణా షాపు నిర్వహిస్తున్నారు. ఈనెల 14న సుబ్రహ్మణ్యం షాపు ముందు శ్రీనివాసరావు ద్విచక్ర వాహనం పార్కింగ్ చేస్తుండగా, ఇద్దరి మధ్యా గొడవ జరిగింది. కర్రతో సుబ్రహ్మణ్యంపై శ్రీనివాసరావు దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను మోసం చేసిన వ్యక్తిపై...

ఫేస్‌బుక్‌లో పరిచయమైన మహిళను ప్రేమిస్తున్నానని చెప్పిన వ్యక్తి మోసం చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి ఫేస్‌బుక్‌లో కొరిటిపాడుకు చెందిన గురుప్రసాద్ పరిచయమయ్యాడు. ప్రేమిస్తున్నట్లు నటించాడు. తన అవసరాలు చెప్పి విడతల వారీగా మహిళ వద్ద నుంచి రూ. 10 లక్షల వరకు తీసుకున్నాడు. అనంతరం డబ్బులు ఇవ్వకపోగా, అడిగితే మహిళను దుర్భాషలాడాడు. బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షాపులో చోరీపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: పాన్ షాపులో చోరీపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. చంద్రమౌళీనగర్‌లో నివసించే జి.శేషగిరిరావు బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద పాన్ షాపు నిర్వహిస్తుంటారు. ఈనెల 28వ తేదీ ఉదయం షాపు వద్దకు వెళ్లగా తాళం పగులగొట్టి ఉంది. సిగరెట్లు, ఇతర సరుకులు చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.